ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
బుధవారం 18 డిసెంబరు 2024

ఐఐసీటీలో ఉద్యోగ అవకాశాలు

మేడ్చల్ టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఐటీఐ వృత్తి విద్యాకోర్సులు పూర్తి చేసుకున్న వారికి తార్నాక ఐఐటీసీలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు మేడ్చల్ ఐటీఐ ప్రిన్సిపాల్ హనుమానాయక్ అన్నారు. 26 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఇన్‌స్ట్రూమెంట్ మెకానిక్, కెమికల్ ల్యాబ్ అసిస్టెంట్ తదితర కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారు ఉద్యోగాలకు అర్హులని తెలిపారు. అదనపు సమాచారం కోసం నంబర్ 9963729969లో సంప్రదించాలన్నారు.

యాసంగి సాగుకు నారు సమస్య!

జాగ్రత్తలు తీసుకున్నా పెరగని వరినారు

సరిపడా పెరగని తుకం

ఆందోళనలో రైతులు

7



పంచాయతీ ఎన్నికలపై సందిగ్ధత

విలీన గ్రామాల ప్రజల్లో పెరుగుతున్న ఉత్కంఠ

ఓటరు తుది జాబితా విడుదల

ఏర్పాట్లపై అధికారుల దృష్టి

8



మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజనం

నూతన చార్ట్‌ను పాటించాలి

సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

సిరిగిరిపేట్, కోటబాస్పల్లి, కొత్లాపూర్ పాఠశాలల తనిఖీ

6





సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

తాగునీరు, టాయిలెట్లు, ఫ్యాన్లను వెంటనే ఏర్పాటు చేయాలి

హాస్టల్స్‌లో అన్ని వసతులు కల్పించాలి: కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, డిసెంబర్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతి వసతి గృహంలో పిల్లలకు తాగునీరు, టాయిలెట్స్, లైట్స్, ఫ్యాన్‌లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ అధికారులు హాస్టల్స్ వార్డెన్‌లతో ఆయన జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, బాలుర, బాలికలు హాస్టల్స్‌లో ఉండే మేజర్, మైనర్ రిపేర్ పనులపై వెంటనే దృష్టి సారించాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, డీఆర్‌డీఏ శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, గిరిజన మైనార్టీ సంక్షేమ అధికారులు సంబంధిత వార్డెన్లు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇళ్ల సర్వే

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయం కాన్ఫరెన్సు హాలు నుండి కమిషనర్‌లు, ఎంపిడిఓలతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు నిర్వహిస్తున్న మొబైల్ యాప్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రజాపాలన సందర్భంగా దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను సర్వేయర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ, తప్పిదాలకు తావులేకుండా వివరాలను నమోదు చేయాలన్నారు. అర్హత కలిగిన కుటుంబాలకు ప్రభుత్వపరంగా లబ్ధి చేకూరేందుకు వీలుగా వివరాల నమోదులో అవసరమైన అన్ని జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, డీఆర్‌డీఏ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

విద్యాశాఖకు అనుబంధంగా పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు, సిబ్బంది సమ్మెలోకి వెళ్లడంతో కేజీబీవీలు, గురుకుల పాఠశాలలు, భవిత కేంద్రాలు బోసిపోయాయి. కేజీబీవీలు, పట్టణ గురుకుల పాఠశాల(యూఆర్ఎస్)ల్లో విద్యా బోధన నిలిచిపోయింది. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాయింగ్, ఆర్ట్స్, క్రాఫ్ట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ అందించే ప్రత్యేక ఉపాధ్యాయుల సేవలు కూడా నిలిచిపోయాయి. బోధన, బోధనేతర సిబ్బంది అందరూ సమ్మెలోకి వెళ్లడంతో మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సమగ్ర శిక్ష కార్యకలాపాలు పూర్తిగా స్తంభించిపోయాయి. సమగ్ర శిక్ష ఉద్యోగులు, సిబ్బంది చేపట్టిన నిరవధిక సమ్మెతో బోధన జరగక విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.



వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు, సిబ్బంది

సమ్మెలో సమగ్రం!

12 రోజులుగా సాగుతున్న ఆందోళనలు

- స్తంభించిన విద్యా బోధన
- బోసిపోయిన కేజీబీవీలు, యూఆర్ఎస్‌లు
- డిమాండ్ల సాధనకు ఉద్యోగుల పట్టు
- పెరుగుతున్న ప్రజా, ఉపాధ్యాయ సంఘాల మద్దతు
- సమీపిస్తున్న ఇంటర్, టెన్త్ పరీక్షలు
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసనలు ఉధృతం

వికారాబాద్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దారిద్ర్యరేఖకు దిగువన ఉండి, విద్యాపరంగా వెనకబడిన వర్గాలకు చెందిన ఆడపిల్లలకు గురుకుల విధానంలో చదువుతో పాటు భోజనం అందించేందుకు 2004లో అప్పటి కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కేజీబీవీలు ఏర్పాటు చేసింది. ఈ విద్యాలయాల్లో బోధన, బోధనేతర సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా, ప్రత్యేకాధికారులు(ఎస్‌వోలు) పర్యవేక్షిస్తున్నారు. మిగతా విభాగాల్లో విధులు నిర్వర్తించే బోధనేతర సిబ్బంది, అకౌంటెంట్లు, ఏఎన్ఎంలు, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లు, మండల స్థాయిలో విధులు నిర్వహించే సీఆర్పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఐఈఆర్పీలు, జిల్లా స్థాయిలో పపీవోలు, సిస్టమ్ ఎనలిస్టులు, టెక్నికల్ పర్సన్లు, డీఎల్ఎంటీ మెసెంజర్లు విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 728 మంది సమగ్ర శిక్ష ఉద్యోగులు ఉండగా, కేజీబీవీలో 481, యూఆర్ఎస్‌లో 14, సీఆర్పీలు 59 మంది, ఐఈఆర్పీలు ఎంఐఎస్సీవోలు 13, సీసీవోలు 15, మెసెంజర్లు 16, పీటీఐలు 98 మంది పనిచేస్తుండగా, వారందరూ నిరవధిక సమ్మెలో పాల్గొంటున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 12 రోజులుగా నిరవధికంగా సమ్మె నిర్వహిస్తుండడంతో

మిగతా 8వ పేజీలో...

కేజీబీవీలు 18	యూఆర్ఎస్‌లు 02
భవిత కేంద్రాలు 18	విద్యార్థులు 5,665

ఉద్యోగుల వివరాలు

కేజీబీవీల్లో 480	డీపీవోలు 07
యూఆర్ఎస్‌ల్లో 14	సీసీవోలు 15
సీఆర్పీలు 59	మెసెంజర్లు 16
ఐఈఆర్పీలు 26	పీటీఐలు 98
ఎంఐఎస్సీవోలు 13	మొత్తం 728



అన్ని సదుపాయాలు కల్పించాలి

సమగ్ర శిక్ష ఉద్యోగులుగా సమాన పనికి సమాన వేతనానికి నోచుకోవడం లేదు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నా అతి తక్కువ వేతనం చెల్లిస్తున్నారు. కొన్ని కేజీబీవీల్లో ఇంటర్ కూడా బోధిస్తున్నాం. సమగ్ర శిక్ష ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికి వర్తించే సదుపాయలను కల్పించాలి

-ప్రభావతి, కేజీబీవీ ప్రత్యేకాధికారి, మోమిన్‌పేట్

డిమాండ్లలో కొన్ని...

- ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి.
- విద్యా శాఖలో విలీనం చేయాలి.
- పార్ట్‌టైం వారిని ఫుల్‌టైం ఉద్యోగులుగా గుర్తించాలి.
- 61ఏళ్లు నిండిన ఉద్యోగులకు రూ.20 లక్షల రిటైర్‌మెంట్ బెనిఫిట్ ఇవ్వాలి.
- మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు రూ.15 లక్షల పరిహారం చెల్లించాలి.
- రూ.10 లక్షలు జీవిత బీమా, రూ.5 లక్షలు ఆరోగ్య బీమా కల్పించాలి.
- రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగానే అన్ని సదుపాయాలు కల్పించాలి.

ఘన స్వాగతం



శీతాకాల విడిదికి నగరానికి చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్మును హకీంపేట విమానాశ్రయంలో మంగళవారం కలెక్టర్ గౌతమ్ స్వాగతం పలికారు. అంతకుముందు ఎయిర్‌పోర్టుకు చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, గవర్నర్ జిష్ణుదేవ్‌లకు సైతం ఆయన స్వాగతం పలికారు. ఆయనతో పాటు అదనపు కలెక్టర్ రాధికా గుప్తా తదితరులున్నారు.

-మేడ్చల్ ప్రతినిధి, డిసెంబర్ 17(ఆంధ్రజ్యోతి):

చలి పంజా

రెండు రోజులుగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు

చందనవెల్లిలో 6.8, మోమిన్‌పేటలో 6.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు



కందుకూరు మండల కేంద్రంలో చలిమంట కాగుతున్న చిన్నారులు

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో చలి చంపేస్తుంది. గజగజ వణిస్తుంది. రెండు రోజుల నుంచి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. మంగళవారం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం చందనవెల్లి గ్రామంలో 6.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటలో 6.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, మేడ్చల్ జిల్లా ఉప్పల్ పరిధిలోని మౌలాలిలో 8.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం నుంచే మంచు కమ్ముకోవడంతో పొద్దెక్కినా ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు వెనుకంజ వేస్తున్నారు. ఇక రాత్రివేళలో చలికి తట్టుకోలేక స్వెటర్లు, మాస్కులు, మఫ్లర్లు ధరిస్తున్నారు. అంతేకాకుండా చలిమంటలు కాగుతున్నారు. చలి తీవ్రత కారణంగా చిన్నారులు, పెద్దలు జలుబు, శ్వాస సంబంధ సమస్యలతో పాటు జ్వరంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో తగు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

రైల్వే వంతెన నిర్మాణం నత్తనడక

ఘట్‌కేసర్‌లో 16 ఏళ్లుగా సాగుతున్న బ్రిడ్జి నిర్మాణం

- త్వరగా పూర్తి చేయాలంటూ రిలే నిరాహార దీక్షలు
- పరిహారం కోసం బాధితుల నిరసనలు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు, స్థానికులు



ఘట్‌కేసర్‌లో అసంపూర్తిగా దర్శనమిస్తున్న రైల్వే వంతెన

ఘట్‌కేసర్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ రైల్వే వంతెన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో నిత్యం ప్రజలు నరకం చూస్తున్నారు. 16 ఏళ్లుగా పనులు నడుస్తున్నా ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా నిర్మాణ పనులు ఉన్నాయి. నాలుగడుగులు ముందుకు 10 అడుగులు వెనక్కు అన్నట్లుగా మారింది. ముగ్గురు ఎమ్మెల్యేలు మారి నాలుగో ఎమ్మెల్యే పదవీకాలం సైతం ఎడాది దాటింది. అయినా అదే పరిస్థితి. ఐదేళ్లపాటు మంత్రిగా పని చేసిన మల్లారెడ్డి హయంలోనూ పని పూర్తికాక పోవడంపై పలువురు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ రంగంలోకి దిగి కాంట్రాక్టర్‌తో చర్చించి పనులు చేపట్టడానికి ప్రయత్నం చేసినప్పటికీ ఆశించిన మేర ముందుకు సాగడం లేదు. రైల్వే వంతెన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని 17 రోజులుగా రిలే నిరాహార దీక్షలు సాగిస్తున్నారు. ఈదీక్షా శిబిరాన్ని ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం ఇటీవల సందర్శించి సంఘీభావం తెలిపారు.

కొత్త నోటిఫికేషన్‌కు డిమాండ్

వంతెన నిర్మాణంలో 125 మంది తమ ఇళ్లను కోల్పోతున్నారు. ఇందులో 25 మంది బాధితులు నష్టపరిహారం అందింది. మిగతా వారు డబ్బులు తీసుకోకుండా న్యాయపోరాటం సాగిస్తున్నారు. ఒకవైపు పనులు కొనసాగుతూనే ఉండగా భూసేకరణ నోటిపికేషన్‌ను

మిగతా 8వ పేజీలో...

28 కిలోల గంజాయి పట్టివేత

వికారాబాద్ రైల్వేస్టేషన్‌లో గుర్తింపు

వికారాబాద్, డిసెంబర్ 17(ఆంధ్రజ్యోతి): డీటీఎఫ్ బృందం, ఎస్‌హెచ్‌ఓ బృందం కలసి వికారాబాద్ రైల్వేస్టేషన్ లో మంగళవారం రైలు తనిఖీల్లో 28 కిలోల ఎండు గంజాయిని పట్టుకున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయ్ భాస్కర్ తెలిపారు. ఈ మేరకు ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. లోకమాన్య తిలక్ టెర్మినల్ (విశాఖపట్నం-ముంబై) రైలులో తనిఖీ చేస్తుండగా, రెండు బ్యాగుల్లో 28 కిలోల డ్రై గంజాయిని గుర్తించారు. ఈ ఘటనలో ముంబైకి చెందిన జితేంద్ర మంజునాథ నాయక్, ప్రతిభ అన్నప్ప మొగ్వేరా అనే ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో, ఆ ఇద్దరూ ఆంధ్ర - ఒడిశా బోర్డర్ (ఏఓబీ) ప్రాంతానికి చెందిన గుర్తు తెలియని వ్యక్తి నుంచి గంజా కొనుగోలు చేసినట్లు అంగీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో వికారాబాద్ ఎక్సైజ్ సీఐ రాఘవీణా, ఎక్సైజ్, రైల్వే పోలీసులు పాల్గొన్నారు.

షుగర్, కేన్సర్ బాధితులను గుర్తించాలి

జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి వెంకటరమణ



మాట్లాడుతున్న వెంకటరమణ

వికారాబాద్, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): అధిక రక్తపోటు, మధుమేహం, కేన్సర్ బాధితులను గుర్తించి పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి వెంకటరమణ సిబ్బందికి సూచించారు. ప్రాథమిక దశలోనే చికిత్స అందే విధంగా జాగ్రత్త వహించాలని తెలిపారు. మంగళవారం వికారాబాద్ రామయ్యగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడ అందిస్తున్న ఎన్‌సీడీ సేవలను పరిశీలించారు. అనంతరం అధికారులు, వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ చికిత్స పొందుతున్న వారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతిఒక్కరికీ ఏబీహెచ్‌ఏ ఐడీలు క్రియేట్ చేయాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పని వేళలను కచ్చితంగా పాటించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో టీపీజేఎంఏ ప్రతినిధులు

ఫీజు బకాయిలను విడుదల చేయండి

డిప్యూటీ సీఎంను కలిసిన టీపీజేఎంఏ ప్రతినిధులు

వికారాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు బకాయలను త్వరగా చెల్లించి ఆదుకోవాలని తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య సంఘం (టీపీజేఎంఏ) డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు విజ్ఞప్తి చేసింది. మంగళవారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గౌరి సతీశ్, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు పార్థసారథి, మల్లేశం, మధుసూధన్‌రెడ్డి, శ్రీనివాస్ చౌదరి, జహీర్‌లతో కూడిన ఎనిమిది మంది సభ్యుల బృందం ఆయనను కలిసి తమ ఇబ్బందులను వివరించింది. మూడేళ్లుగా స్కాలర్‌షిప్, ఫీజు బకాయిలు రాక కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయన్నారు. సిబ్బందికి వేతనాలు, భవనాలకు అద్దె చెల్లించలేక, చేసిన అప్పులకు వడ్డీ చెల్లించలేక తీవ్ర మనోవేదనకు గురవుతున్నామని వారు ఆర్థిక మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆర్థిక సమస్యలతో కొందరు ఆత్మహత్యలు చేసుకున్నారని వారు వివరించారు. స్పందించిన డిప్యూటీ సీఎం దశల వారీగా చెల్లించి విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, కళాశాలల యాజమాన్యాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. 20వ తేదీ నుంచి ప్రారంభించి సాధ్యమైనంత వరకు బకాయిలను ఈ ఆర్థిక సంవత్సరంలో చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా టీపీజేఎంసీ అధ్యక్షుడు గౌరి సతీష్ ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎంను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో జూనియర్, డిగ్రీ, బీఎడ్ కళాశాలల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యం వహించొద్దు : డీఎస్పీ 7

మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజనం అందించాలి

తాండూరు రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇటీవల ఆయా పాఠశాలల్లో నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు నూతన మెనూను విడుదల చేసిందని, అట్టి మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజనం అందించాలని తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ ఆదేశించారు. మండల పరిధిలోని సిరిగిరిపేట్, కోటబాస్పల్లి, కొత్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ముందుగా సిరిగిరిపేట్ పాఠశాలకు వెళ్లి హెచ్ఎం మధుసూదనరెడ్డితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కిచెన్‌లో బియ్యం స్టాక్ రిజిష్టర్ పరిశీలించారు. సమీపంలోని కొత్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఆదేశించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



విద్యార్థుల రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కడ్తాల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. గ్రామాలు, తండాల ప్రజలకు వైద్య సేవలందించేందుకు ప్రైవేట్ ఆస్పత్రులు, స్వచ్ఛంద సంస్థలు, వైద్యులు ముందుకు రావాలని కోరారు. చరికొండలో మంళవారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్, జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఉప్పల అఖిల్ ఆధ్వర్యంలోని వైద్యులు 312 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ముందులందజేశారు. పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య నియమాలు, చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వెంకటేశ్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లాల్‌కోట నర్సింహా గౌడ్, జె.వీరయ్య, నర్సింహ, కోటేశ్, నరేశ్, ప్రశాంత్, హుస్సేన్, కృష్ణ, గోపాల్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



మందులు అందజేస్తున్న దశరథ్‌నాయక్, వెంకటేశ్

వైద్య శిబిరం విజయవంతం

న్యామతాపూర్‌లో వైద్య శిబిరం విజయవంతమైంది. కలాం ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఎవరెస్ట్, మలకపేట యశోద ఆసుపత్రి సహకారంతో బోదాసు మహేశ్ ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆమనగల్లు ఏఎంసీ చైర్‌పర్సన్ యాట గీత ప్రారంభించారు. 225 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులందజేశారు. కార్యక్రమంలో బిచ్యానాయక్, షాబుద్దీన్, బి.రాంరెడ్డి, ఫారుఖ్, జానారెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీశైలం, మల్లేశ్, మహేశ్, కృష్ణ, జయరాములు, బాల్‌రాజ్, రవి, భాను పాల్గొన్నారు.

హరితహారం మొక్కలకు నిప్పు



కుర్మిద్దలో కాలిపోయిన చెట్లు

యాచారం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కుర్మిద్దలో పెంచుతున్న మొక్కలు చెట్లుగా పెరిగాయి. వాటి వద్ద మంగళవారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో 15 చెట్లు బూడిదయ్యాయి. దీంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్లక్రితం నాటిన మొక్కలు చెట్లుగా ఎదిగి నీడనిస్తున్నాయని, వాటికి నిప్పు పెట్టడం చూసిన పంచాయతీ సిబ్బంది వేదన చెందారు. తాము కష్టపడి మొక్కలను పెంచామని, అవి కాలిపోవడం బాధగా ఉందని పంచాయతీ సిబ్బంది అన్నారు. నిప్పు పెట్టిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ వారు ఇందిరమ్మ మహిళాశక్తి పథకం ద్వారా ఉచిత కుట్టుమిషన్లు అందిస్తున్నారని మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి హన్మంత్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైనార్టీ మహిళలు (ముస్లిం, సిక్కు, బౌద్ధ, జైన్స్ లేదా పారిస్) వారు ఆన్‌లైన్‌లో టీజీవోబీఎంఎంఎస్.సీజీజీ.జీవోవీ.ఐఎన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, హార్డ్ కాపీ జిల్లా మైనార్టీ సంక్షేమ కార్యాలయంలో అందించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7993357103 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

భక్తి మార్గం సమాజ శాంతికి దోహదం



పూజల్లో గూడూరు శ్రీనివాస్ రెడ్డి

కడ్తాల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రజల భక్తి, దైవ మార్గంలో నడిస్తే మానవాళి పురోగమనానికి, శాంతి స్థాపనకు దోహదపడుతుందని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కడ్తాలలోని శివాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఆలయంలో గురుస్వాములు మహేశ్, రాజు, శ్రీకాంత్ నిర్వహించిన అయ్యప్ప పడిపూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, వెంకటేశ్, పిప్పళ్ల వెంకటేశ్, క్యామ రాజేశ్, లక్ష్మణ్, మహేశ్, భగీరథ్, టిల్లు, శేఖర్, కార్తీక్, భక్తులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థి అదృశ్యం



కొత్తగడి విష్ణు

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నంలోని గురునానక్ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి అదృశ్యమయ్యాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలం రాంనాథ్‌గుడ్‌పల్లికి చెందిన కొత్తగడి విష్ణు(17) బీటెక్ ఫస్టియర్ చదువుతున్నాడు. కాలేజి హాస్టల్‌లో ఉంటున్న అతడు ఈ నె 14న కాలేజీ నుంచి ఎటో వెళ్లిపోయాడు. విష్ణు తండ్రి బాల్‌రాజ్ కుమారుడికి ఫోన్‌చేసినా స్పందన లేదు. దీంతో సోమవారంరాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

వికారాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే సదుపాయాలన్నీ తమకు వర్తింపజేయాలని జిల్లా సమగ్ర శిక్షా ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు కె.గాంగ్యానాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట తమ నిరవదిక సమ్మె నిర్వహించారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల్లో ఒకరు అంబేడ్కర్ వేషధారణతో సమ్మె వేదిక వద్ద కూర్చొని అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం నుంచి బీజేఆర్ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ మానవహారం నిర్వహించారు. అంతకు ముందు తెలంగాణ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిలాల్, కె.రాంరెడ్డితో పాటు పలువురు ఎంఈవోలు, జీహెచ్ఎంలు సమగ్ర శిక్షా ఉద్యోగులకు తమ మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష జేఏసీ ప్రతినిధులు శేఖర్, రవికుమార్, ప్రభావతి, రాజేశ్వరి, స్వరూప, స్రవంతి, ఆశాలత, వెంకట్‌రెడ్డి, రఘు, మోహన్, కృష్ణవేణి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట సమ్మె నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

రైల్వే వంతెనకు మరమ్మతులు చేయించాలి



వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఘట్‌కేసర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధిలోని యంనంపేట్ రైల్వేవంతెన గుంతల మయమైందని, వెంటనే మరమ్మతులు చేయించాలని పలువురు కాంగ్రెస్ నాయకులు మంగళవారం మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వనతిపత్రం అందజేశారు. అనేక సంవత్సరాలుగా కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రధానంగా వంతెనపైన పలుచోట్ల ఇనుప చువ్వలు కనిపిస్తున్నాయని, ప్రమాదాలు జరుగక ముందే మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, గణేష్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

ఆదిభట్ల-నాదర్‌గుల్ రోడ్డును నాలుగు లేన్లుగా మార్చండి

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల నుంచి నాదర్‌గుల్ వరకు ఉన్న రోడ్డును నాలుగు లేన్లకు విస్తరించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డికి ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి విన్నవించారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని టీజీఐఐసీ కార్యాలయంలో ఆయన వినతి పత్రం అందజేశారు. అంతేగాక ఈ రోడ్డుకు రతన్ టాటా పేరు పెట్టాలన్నారు. ఆదిభట్ల టీసీఎస్ ఆవరణలో రతన్‌టాటా కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా ఈ సందర్భంగా కోరారు.



విష్ణువర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నిరంజన్‌రెడ్డి

'కేసీఆర్ బాటలోనే రేవంత్‌రెడ్డి పాలన'

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించడం అన్యాయం అని, గత బీఆర్ఎస్ బాటలనే రేవంత్‌రెడ్డి సర్కార్ నడుస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు మంగళవారవ నగరంలోని ఇందిరాపార్కుకు మహాధర్నాకు వెళ్తున్న వారిని పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టును దేవేందర్ ఖండించారు. తెలంగాణ ప్రభుత్వం కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపించారు. కార్మికులను పర్మినెంట్ చేయాలని.. ఈఎస్ఐ, పీఎఫ్, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక యూనియన్ నాయకులు రత్నం, అంజనేయులుగౌడ్, మాణిక్యం తదితరులు ఉన్నారు.

పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే



ఆమనగల్లులో సర్వే నిర్వహిస్తున్న కమిషనర్ వసంత

ఆమనగల్లు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీవో కుసుమ మాధురి, మున్సిపల్ కమిషనర్ వసంత కోరారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండాలో ఎంపీడీవో, మున్సిపాలిటీ వార్డుల్లో కమిషనర్ మంగళవారం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వేను పరిశీలించారు. సిబ్బందికి సూచనలు చేశారు. ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా సర్వే చేస్తూ ఇళ్లు లేని పేదలను గుర్తిస్తున్నట్లు చెప్పారు. నిబంధనలను అనుసరించి సర్వే చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు విజయ్‌రాథోడ్, మాజీ ఉపసర్పంచ్ మల్లేశ్, ఫీల్డ్ అసిస్టెంట్ రవీందర్ పాల్గొన్నారు.

తట్టేపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలి

శాసన సభలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



తాండూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పెద్దేముల్ మండలం తట్టేపల్లి గ్రామం యూనిట్‌గా మండల కేంద్రాన్ని ప్రకటించాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కోరారు. అసెంబ్లీలో మంగళవారం ఆయన మాట్లాడుతూ కచ్చితంగా కొత్త మండలాన్ని ప్రకటించాలని ఆయన కోరారు. చాలా రోజులుగా తట్టేపల్లిని మండల కేంద్రం చేయాలని డిమాండ్ చేస్తూ రిలే నిరాహార దీక్షలు చేశారని ఆయన గుర్తుచేశారు. అన్ని అర్హతలు ఉన్న ఈ ప్రాంతాన్ని రెవెన్యూ మంత్రి మండలంగా ప్రకటించాలని కోరారు.

ప్రజలందరికీ మేలు జరగాలి



రంగరాజన్‌ను సన్మానిస్తున్న శ్రీహరి

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): లోక కల్యాణం కోసం అవతరించిన అయ్యప్ప స్వామి దీవెనలతో సమస్త జీవులకు మేలు కలగాలని చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధానార్చకుడు సీఎస్.రంగరాజన్ ఆకాంక్షించారు. మంగళవారం మొయినాబాద్‌లో పెద్దమంగళారానికి చెందిన సీనియర్ జర్నలిస్టు కటికె శ్రీహరి నిర్వహించిన అయ్యప్ప పడిపూజ కార్యక్రమానికి రంగరాజన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతీ వ్యక్తి దైవ చింతన కలిగి ఉండాలని, దానితోనే సన్మార్గం, ఆరోగ్యం సాధ్యమన్నారు. పూజ సందర్భంగా ఖైరతాబాద్‌కు చెందిన నర్సింగ్‌రావు ఆలపించిన అయ్యప్ప భజన గీతాలు ఆకట్టుకున్నాయి. మెట్ల పూజలో స్వాములు ఆడిపాడారు. కార్యక్రమంలో మాలధారులు ఉమాశంకర్‌రెడ్డి, రాంచందర్, సురేందర్‌గౌడ్, వివిధ ప్రాంతాల స్వాములు పాల్గొన్నారు.

వందేళ్ల చరిత్ర ఉన్న పార్టీ సీపీఐ



మాట్లాడుతున్న జంగయ్య

చేవెళ్ల, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): దేశంలో వందేళ్ల చరిత్ర కలిగిన ఏకైక పార్టీ సీపీఐ మాత్రమే పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలమకుల జంగయ్య అన్నారు. సీపీఐకి వందేళ్లు నిండుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం కందవాడలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. సీపీఐ ఆవిర్భావోత్సవాలను నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. 99సంవత్సరాలుగా ప్రజల పక్షాన పోరాడుతున్నది సీపీఐ అని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు జె.అంజయ్య, పార్టీ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణచారి, మంజుల, వెంకటయ్య సత్తయ్య, పద్మ, పెంటయ్య గోపాల్, సుధాకర్‌గౌడ్, బుచ్చయ్య, రాంచంద్రయ్య, లలిత, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు, నాయకులు

తలకొండపల్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాంపూర్‌లో లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలకు వివిధ ప్రాంతాల భక్తులు తరలొస్తున్నారు. మంగళవారం ప్రత్యేకపూజలు, అభిషేకాలు, చక్రతీర్థం, నాగబలి నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పవన్‌కుమార్‌రెడ్డి, ఏవో స్నేహలత పాల్గొన్నారు.

ఎంపీలను కలిసిన బీజేపీ నాయకులు



ఎంపీలతో షాద్‌నగర్ బీజేపీ నాయకులు

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య మంగళవారం ఢిల్లీలో ఎంపీలను మర్యాదపూర్వకంగా కలిశారు. మెదక్, చేవెళ్ల, ఆదిలాబాద్ ఎంపీలు రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, గోడం నగేష్‌లను కలిసి పలు విషయాలను వారి దృష్టికి తెచ్చినట్లు తెలిపారు. వారి వెంట యువమోర్చా రాష్ట్ర నాయకుడు వంశీకృష్ణ ఉన్నారు.

ఉపాధి హామీ లెక్కలు పక్కాగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

కొత్తూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి):ఉపాధి హామీ పనుల లెక్కలను పక్కాగా నిర్వహించాలని ఉపాధి హామీ పథకం ప్రిసైడింగ్ అధికారి జి.నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కొత్తూరు మండలంలో చేపట్టిన కేంద్ర ప్రభుత్వ పథకాల సామాజిక తనిఖీలో పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పనులకు బిల్లులు సక్రమంగా లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏమైనా సమస్యలొచ్చినప్పుడు అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. మండలంలో చేపట్టిన పనుల లెక్కల్లో తప్పులున్నట్లు గుర్తించినట్లు వెల్లడించారు. ఇందుకు బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఏపీడీ, అంబుడ్స్‌మన్ సునీతామూర్తి, సీసీ, పీఆర్ అధికారులు పాల్గొన్నారు.

మండల సాధనకు పోరాటం ఉధృతం



దీక్షలో పాల్గొన్న జేఏసీ నాయకులు

తలకొండపల్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లి గ్రామస్తులు మండల కేంద్రం సాధన పోరాటాన్ని ఉధృతం చేశారు. సమీప గ్రామాలు, తండా వాసులతో కలిసి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు మంగళవారానికి 48వ రోజుకు చేరాయి. దీక్షలో మహిళలు, జేఏసీ నాయకులు, యువకులు పాల్గొన్నారు. వెంకట్రావ్‌పేట, ఖానాపూర్, మెదక్‌పల్లి, వీరన్నపల్లి, గౌరిపల్లి, బల్సుపల్లి తండా, చౌదర్‌పల్లి, కేపీతండాలను కలిపి గట్టిప్పలపల్లి మండల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ అశోక్‌గౌడ్, శరత్‌చంద్ర, ఆంజనేయులు, నర్సింహ, యాదయ్య లక్ష్మయ్య, చెన్నయ్య, జంగయ్య, మల్లేశ్ పాల్గొన్నారు.



పరిగి శివారులో నారుమడిలో పలుచగా ఉన్న వరినారు

యాసంగి సాగుకు నారు సమస్య!

ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా పెరగని వరినారు

- వాతావరణంలో మార్పులే కారణమా?
- రెండెకరాలకు నారు పోస్తే అర ఎకరం రాని పరిస్థితి
- ఆందోళనలో రైతులు

పరిగి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): యాసంగి వరిసాగుకు నారు సమస్య తలెత్తింది. వానాకాలం సీజన్‌లో కలిసిరాని కాలంతో తీవ్రంగా నష్టపోయిన రైతులు యాసంగిపైనే ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే కరియట్లు, నార్లు పోసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. అయితే వరిసాగులో నారుమళ్లు ఆశించినమేర మెరగక రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా ఈ సమస్య తలెత్తుతోంది. తీవ్రమైన చలిగాలులు, సారవంతమైన భూములు లేకపోవడం, ముఖ్యంగా జింక్‌లోపం, విత్తనాల సమస్యతో నారుమళ్లు ఏమాత్రం పెరగడంలేదు. మొలక ఆకుపచ్చగా కాకుండా పసుపు పచ్చగా మారి వేసిన నారు నిరుపయోగంగా మారుతోందని కొందరు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో అయితే అసలు నారుమడి నుంచే మొలకలు సరిగ్గా రావడం లేదు. వారం రోజుల పాటు నీళ్లలో నానబెట్టిన మొలక రావడంలేదని, ఇలా ఎందుకు జరుగుతుందో అర్థం కావడం లేదని రైతులు వాపోతున్నారు. విత్తనాల్లో నాణ్యత లేమితో ఇలా అవుతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం సకాలంలో పంపిణీ చేయని కారణంగా రైతులు మార్కెట్‌లో కొనుగోలుచేసి నారుమళ్లు పోసుకున్నారు. ఇలాంటి విత్తనాలు అసలు సగం కూడా మొలకెత్తక తీవ్రంగా నష్టపోతున్నామని వాపోతున్నారు. నారుమళ్లే ఇలా ఉంటే వరి పైరుకు ఎన్ని రోగాలు వస్తాయోనని రైతులు ఆవేదన చెందుతున్నారు.

జిల్లాలో 60వేల ఎకరాలకుపైగా వరిసాగు

జిల్లాలో ఈ సీజన్‌లో 60 వేల ఎకరాలకుపై వరి సాగు చేయనున్నారు. జిల్లాలోని పరిగి, దోమ, కులకచర్ల, బొంరాసిపేట్, కొడంగల్, దౌల్తాబాద్, యాలాల, తాండూరు, బషీరాబాద్, పెద్దేముల్ మండలాల్లో చెరువులు, బోర్ల కింద వరిని విస్తారంగా సాగుచేస్తున్నారు. చెరువులతో పాటు 70వేలకు పైగా ఉన్న బోర్ల కింద వరిని సాగు చేయడం ప్రారంభించారు. అయితే వరినారు రెండెకరాలకు పోస్తే అరెకరం కూడా సరిపోకపోవడం ఏం చేయాలో తోచడం లేదని రైతన్నలు దిగులు చెందుతున్నారు. మళ్లీ నారు వేయడానికి సమయం సరిపోదు. ఏ రైతు నోట విన్నా నారు సరిగ్గా లేదన్న మాటే వినిపిస్తోంది.

చలిగాలులతోనే సమస్య



యాసంగి వరిసాగుకు వరినారు సమస్యతో ఇబ్బంది పడుతున్నాం. ఈసారి చలి తీవ్రంగా ఉంది. మొలక దశలోనే ఇబ్బందిగా ఉంది. నానబెట్టిన వడ్లు వారం రోజులైనా మొలక రావడం లేదు. ఒకవేళ మొలక వచ్చిన దాన్ని కరియట్లో చల్లినా పైకి ఎదగడం లేదు. రెండు ఎకరాలకు పోసిన అరఎకరానికి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

- కాకి కృష్ణ, రైతు, మిట్టకోడూరు

నారుమళ్లకు జాగ్రత్తలు అవసరం



నారుమడి ఏర్పాటుకు పది రోజుల ముందే దుక్కిని చదును చేసుకోవాలి. నారుమడిలో నీరు తీసివేయడానికి కాలువలు ఏర్పాటు చేసుకోవాలి. మళ్ళలో అసలు నీరు నిల్వ ఉంచరాదు. రెండున్నర గుంటల నారుమడికి 2కిలోల నత్రజని, 2 కిలోల భాస్వరం, 2 కిలోల పొటాష్ వేసుకోవాలి. వరినారు ఆకులు వేసే దశ వచ్చేవరకు నీరు పలుచగా ఉండేలా చూసుకోవాలి. చలి ఎక్కువగా ఉన్నందున ఆకులకు ఇటుక పొడిరంగులో మచ్చలు వస్తాయి. ఈ రంగుల మచ్చలు రాకుండా 2గ్రాముల జింక్ సల్ఫేట్ లీటరు నీటిలో కలిపి నారుమడికి స్ప్రే చేయాలి. చిగురాకు తెల్లగా మారితే ఒక లీటరు నీటికి 20గ్రాముల అన్నాబేడి, 2గ్రాముల నిమ్మ ఉప్పు కలిపి స్ప్రేచేయాలి. నారు వేసిన పది రోజులకు కార్బోఫ్యూరాన్(వాసనలేని గుళికలు), కార్టన్‌ను సెంటు నారుమడికి 160 గ్రాముల చొప్పున వేయాలి. నారువేసిన పొలం అంతా కొట్టలేని వారు నారుమడికి స్ప్రే చేసుకోవచ్చు. నారు వేసిన తరువాత పొలానికి ఆరు తడిగా నీటిని అందిస్తుండాలి. మంచుకు రాత్రిపూట కవర్లు కప్పి ఉదయం తెసివేస్తే నారు సమస్యను అధిగమించవచ్చు.

- లక్ష్మీకుమారి, ఏడీఏ, పరిగి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దేప భాస్కర్‌రెడ్డి

ప్రపంచ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలి

మహేశ్వరం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పల్లెల నుంచి ప్రపంచ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషిచేస్తున్నారని మహేశ్వరం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం మహేశ్వరంలోని అక్కన్న మాదన్నల కాలంనాటి గడికోట ప్రాంగణంలో సీఎం కప్ క్రీడా పోటీలు జరిగాయి. పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. పదేళ్లుగా ప్రభుత్వ స్కూళ్లలో విద్యతో పాటు క్రీడలకు ప్రోత్సాహం లేక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, సాంకేతిక విద్య, ఆటలకు ప్రోత్సాహం ఇస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ తన సొంత డబ్బుతో విద్యార్థులకు తోడ్పాటు అందిస్తున్నారన్నారు. విజేతలకు కప్పులను అందజేశారు. కార్యక్రమంలో ఎండీవో శైలజారెడ్డి, ఎంఈవో కస్నానాయక్, నాయకులు మల్లేష్‌యాదవ్, కాకి ఈశ్వర్, రఘుపతి, సుదర్శన్, నర్సింహ, సాంబయ్య, హెచ్‌ఎంలు, టీచర్లు పాల్గొన్నారు.

కార్మికుల అరెస్ట్ సరికాదు

తాండూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడితే అరెస్ట్ చేసి కార్మికులను అడ్డుకోవడం సరికాదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ కార్మికులను మోసం చేస్తోందని విమర్శించారు. పోలీసులు ముందస్తు అరెస్టులు చేయడాన్ని ఆయన ఖండించారు. కేసీఆర్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందని, ఉద్యమాలను అణిచి వేయాలని చూస్తున్నారని ఆయన అన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



షాద్‌నగర్ ఆర్డీవో సరితను సన్మానిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు



ఆమనగల్లు: రిటైర్డ్ ఉద్యోగులను సన్మానిస్తున్న సీఐ ప్రమోద్‌కుమార్, పరుషోత్తంరెడ్డి తదితరులు

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషిచేస్తానని షాద్‌నగర్ ఆర్డీవో సరిత అన్నారు. పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో మంగళవారం నేషనల్ పెన్షనర్స్ డేను జరుపుకున్నారు. రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ షాద్‌నగర్ బ్రాంచ్ అధ్యక్షుడు రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి వచ్చిన ఆర్డీవోను సత్కరించారు. రిటైర్డ్ ఉద్యోగులు తమ అనుభవాన్ని, విజ్ఞానాన్ని సమాజ శ్రేయస్సుకు వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ పార్థసారథి, ఏటీవో బాల్‌రాజ్, ఎస్టీవో మహేష్, ఠాగూర్ స్కూల్ కరస్పాండెంట్ రాజేంద్రప్రసాద్, నాయకులు జనార్థన్, జగదీశ్వర్, డి.శేఖర్, పాండు, సత్యనారాయణగౌడ్, నర్సింహులు, నాగేష్, షబ్బీర్, స్వరాజ్‌బాబు, గోపాలస్వామి, గోపాల్‌రావు, నారాయణరెడ్డి, రమాదేవి, గిరిజ, అంజు, సామ్రాజ్యం, గఫ్ఫార్ తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు: పెన్షనర్స్ డేను ఆమనగల్లులో పెన్షనర్ల సంఘం, లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో జరుపుకున్నారు. సరస్వతి శిశుమందిర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాల రిటైర్డ్ ఉద్యోగులు హాజరయ్యారు. సంఘం ఆమనగల్లు యూనిట్ అధ్యక్షుడు కసిరెడ్డి పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకకు విద్యాశాఖ రిటైర్డ్ ఆర్జేడీ పసుల లక్ష్మారెడ్డి, ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్, ఎంఈవో పాండు, రిటైర్డ్ పోలీస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, సంఘ సేవకుడు పి.రాము, మున్సిపల్ వైస్‌చైర్మన్ దుర్గయ్య హాజరయ్యారు. పెన్షనర్ల హక్కులు, సంక్షేమ కార్యక్రమాలపై పురుషోత్తంరెడ్డి వివరించారు. రిటైర్డ్ ఎంప్లాయీస్ భవన్‌కు స్థలాన్ని కేటాయించామని వైస్ చైర్మన్ తెలిపారు. విరమణ ఉద్యోగానికేగానీ సామాజిక సేవలకు కాదని వక్తలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, ట్రెజరర్ వి.నారాయణగౌడ్, సత్యనారాయణ, నారాయణగౌడ్, గుర్రం భద్రయ్య, యాదగిరి, మహాలింగం, విద్యాధర్, శ్రీనివాస్‌రెడ్డి, అంజనేయులు, మహబూబ్ అలీ, జి.యాదగిరి, కసిరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, రాజిరెడ్డి, అశోక్‌రెడ్డి, షఫీ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలాల్లో సరైన వసతులు కల్పించాలి



ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

కీసర, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం సరైనా వసతులు కల్పించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. కీసరలోని మహత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఎలుకల దాడిలో విద్యార్థులకు గాయాలు కావడంతో ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందించిన విషయం తెలిసిందే. ఇట్టి విషయంపై మంగళవారం బీజేపీ నాయకులు విద్యార్థులను పరామర్శించేందుకు పాఠశాలకు వెళ్లారు. విద్యార్థులు తరగతి గదిలో ఉండటంతో నిర్వాహకులు నాయకులను లోపలికి అనుమతించలేదు. దీంతో బీజేపీ నాయకులు పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలంటూ నినాదాలు చేశారు. పాఠశాల నిర్వాహకుల సమాచారంతో ఎస్ఐ వెంకటేష్ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని పరిస్థితిని గమనించారు. తరగతిగదిలో పిల్లలకు అసౌకర్యం కలిచవద్దని, విద్యార్థులు క్షేమంగా ఉన్నారని ఆయన పాఠశాల నిర్వాహకుల ద్వారా తెలుసుకొని బీజేపీ నాయకులకు నచ్చజెప్పారు. దీంతో బీజేపీ నాయకులు అక్కడి నుంచి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఏనుగు సుదర్శన్‌రెడ్డి, సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, నల్లా వెంకట్ రెడ్డి, మల్లారెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

అంతరిస్తున్న కళలను కాపాడాలి



కళాకారులతో టాస్క్ సీవోవో రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): అంతరించిపోతన్న గ్రామీణ కళలు, కళాకారులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. వీధి నాటకాలు చరిత్రను గుర్తుచేస్తాయని పేర్కొన్నారు. బాల భీమాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చౌదర్‌పల్లిలో నిర్వహించిన సంపూర్ణ రామాయణం నాటకాన్ని మంగళవారం రాఘవేందర్‌రెడ్డి తిలకించారు. కళాకారులను సత్కరించారు. వీధి నాటకాల పునరుజ్జీవనానికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందన్నారు. నాటకాలు, కళలు, కళారూపాలు భారతీయ సంస్కృతికి ప్రతిబింబాలన్నారు. పాతతరం నాటక కళాకారులకు ప్రతి ఒక్కరు చేయూతనిచ్చి కొత్త తరం వారు వచ్చేలా కృషి చేయాలని కోరారు. టీవీలు, సినిమాలు, సోషల్ మీడియా ప్రభావంతో వీధి నాటకాలకు ఆదరణ తగ్గిందని అన్నారు. ప్రజాచైతన్య కార్యక్రమాల్లో ఇప్పటికీ కళాకారుల పాత్రే కీలకంగా ఉంటోందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఫౌండేషన్ ఈఎం వరప్రసాద్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, ఆలయ కమిటీ మెంబర్లు చెన్నయ్య, భీమయ్య, ముకుంద, ఆనంద్, యాదయ్య, తిరుపతయ్య, మహేందర్, హన్మంత్, కృష్ణయ్య, రాజేందర్, పెంట్యానాయక్, మాసయ్య, అనంతయ్య పాల్గొన్నారు.

నిర్మాణ రంగ కార్మికులకు సదుపాయాలు కల్పించాలి

శంషాబాద్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ రంగ కార్మికుల అడ్డాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని, వారికి ఉచిత భోజనాన్ని ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శంషాబాద్‌లోని ఎలైట్ హోటల్‌లో మంగళవారం భవన నిర్మాణ కార్మికుల రాష్ట్ర అవ్వాన సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి బాలరాజు మాట్లాడారు. నిర్మాణ భవనాలకు లేబర్ డిపార్టుమెంట్ సెస్సు రూపంలో వసూలు చేస్తున్న డబ్బులను కార్మికుల సంక్షేమానికే వెచ్చించాలన్నారు. 2025 ఏప్రిల్‌లో శంషాబాద్‌లో నిర్మాణ రంగ కార్మికుల రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు, కార్మికులు పి.పర్వతాలు, పామిడి శేఖర్‌రెడ్డి, ఎస్.మల్లేష్, చందు, హరిసింగ్, టి.రామకృష్ణ, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించే వరకు ఆందోళన



మాట్లాడుతున్న అర్జున్‌రావు, శ్రీను, అనురాధ

ఆమనగల్లు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వంలో గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులపై సర్పంచ్‌లకు రావాల్సిన బిల్లులను ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పి.అర్జున్ రావు, మాజీ జడ్పీటీసీ అనురాధ, పార్టీ జిల్లా నాయకుడు వి.శ్రీనునాయక్ కోరారు. సర్పంచ్‌ల బిల్లులివ్వకుండ ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. బిల్లులిచ్చే వరకు ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు. ఆమనగల్లులో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. బిల్లులు రాక మాజీ సర్పంచ్‌లు వేదనకు గురవుతున్నా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. కాంట్రాక్టర్లకు రూ.వేలకోట్లు చెల్లిస్తున్న పాలకులు మాజీ సర్పంచ్‌ల బిల్లులు ఎందుకివ్వడం లేదని ప్రశ్నించారు. సర్పంచ్‌ల బిల్లులపై మాజీ మంత్రి హరీశ్‌రావు అసెంబ్లీలో లేవనెత్తడం హర్షదాయకమన్నారు. డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులపై నిందలేయడం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు జి.బాలస్వామి, ఖలీల్, జి.శంకర్, శివకుమార్, పరమేశ్, రమేశ్, సైదులుగౌడ్, సాయిలు, గణేశ్ పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యం వహించొద్దు: డీఎస్పీ

దోమ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యం వ్యవహరించొద్దని పరిగి డీఎస్పీ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి పోలీసులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల నుంచి ప్రతీ ఫిర్యాదును స్వీకరించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫ్రెండ్లీ పోలీసు విధానంతో ప్రజలతో మమేకమవుతూ బాధితులకు న్యాయం చేయాలన్నారు. నిఘాను పటిష్టం చేసేందుకు సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు.

నిరుపేదలకు అండగా సీఎంఆర్ఎఫ్



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి

మేడ్చల్ టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వైద్య సేవలు పొందతలచిన పేదలకు సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తుందని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తన కార్యాలయంలో మంగళవారం పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి, అమరం హేమంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మద్దుల శ్రీనివాస్‌రెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

బషీరాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బషీరాబాద్, యాలాల మండలాల్లో నేడు(బుధవారం) మధ్యాహ్నం 12గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆశాఖ డీఈఈ భానుప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయిపూర్ రైల్వేట్రాక్ వద్ద అండర్ గ్రౌండ్ కేబుల్ కనెక్షన్ పనులు కొనసాగుతున్నాయన్నారు.

పంచాయతీ ఎన్నికలపై సందిగ్ధం

- విలీన గ్రామాల ఆశావహుల్లో ఉత్కంఠ
- ఏర్పాట్లపై అధికారుల దృష్టి
- ఓటరు తుది జాబితా విడుదల

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లకు అధికారులు కసరత్తు ముమ్మరం చేస్తున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 61 గ్రామపంచాయతీలుడంగా 28 గ్రామపంచాయతీలను మున్సిపాలిటీల్లో విలీనం చేశారు. దీంతో ప్రస్తుతం 33గ్రామాలు మిగిలాయి. మిగిలిన గ్రామాలపై సందిగ్ధత నెలకొన్నప్పటికీ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారులు మాత్రం ఎన్నికల ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పంచాయతీల వారీగా ఓటరు తుది జాబితాను విడుదల చేయడంతో పాటు పోలింగ్‌కేంద్రాల ఏర్పాటు ప్రక్రియను కూడా నిర్వహిస్తున్నారు. పోలింగ్ కేంద్రాల తుది జాబితాను కూడా అధికారులు సిద్ధం చేసేందుకు షెడ్యూల్‌ను కూడా ప్రకటించారు. పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ముసాయిదా జాబితాను ప్రచురించారు.



గ్రామపంచాయతీ కార్యాలయం

సందిగ్ధంలో ఆశావహులు

సాధారణంగా పంచాయతీ ఎన్నికలంటే గ్రామాల్లో కోలాహలం మామూలుగా ఉండదు. ప్రభుత్వం సంక్రాంతి తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని ప్రకటించినప్పటి నుంచి గ్రామాల్లో హడావుడి మొదలై రాజకీయాలు వేడెక్కుతాయి. కానీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మాత్రం ఇందుకు భిన్నంగా పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామాల్లో ఎలాంటి సందడి లేదు. ఇందుకు కారణంగా చివరి వరకు కూడా జిల్లాలోని గ్రామాల్లో అసలు గ్రామపంచాయతీ ఎన్నికలు జరుగుతాయా? లేదా? అనే సందిగ్ధత నెలకొనడమే. దీనిపై అధికారులకు కూడా స్పష్టత లేకపోవడంతో గ్రామాల్లో నాయకులు ఎలాంటి హడావుడి చేయడంలేదు. గ్రామాలుగానే ఉంటాయని కొందరు, సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేస్తారని మరికొందరు, కొత్త మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేస్తారని ప్రచారాలు కొనసాగడంతో నాయకులు, ఆశావహుల్లో సందిగ్ధం వీడటం లేదు. అధికారులు మాత్రం ఎన్నికల సంఘం ఆదేశాలమేరకు ఏర్పాట్లు చేస్తుండటంతో ఆశావాహులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

బ్యాలెట్ పత్రాల ముద్రణ

గ్రామపంచాయతీ ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా అధికారులు మంగళవారం నుంచి గ్రామపంచాయతీలకు సంబంధించిన బ్యాలెట్ పేపర్లు ముద్రించేందుకు ప్రింటింగ్ ప్రెస్‌ల ఎంపిక ప్రక్రియను ప్రారంభించారు. గతంలో బ్యాలెట్ పేపర్లు ముద్రించిన, అర్హులైన ఆఫ్‌సెట్ ప్రింటింగ్ ప్రెస్‌ల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. ఈ వారంలో ప్రింటింగ్‌ప్రెస్ ఎంపిక ప్రక్రియను పూర్తిచేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బ్యాలెట్ బాక్సులనూ సిద్ధం చేస్తున్నారు.

క్రైం కార్నర్

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. వ్యక్తి మృతి

పరిగి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఖుదావంద్‌పూర్ గ్రామానికి చెందిన ఆంజనేయులుగౌడ్, అల్లాపూర్ గ్రామానికి చెందిన అంజయ్యలు ఇద్దరు కలిసి బైక్‌పై షాద్‌నగర్‌లో వెళ్తున్నారు. పరిగి నుంచి షాద్‌నగర్ వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు వేగంగా వస్తూ వెనుక నుంచి బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న ఆంజనేయులు గౌడ్, అంజయ్యలకు తీవ్రగాయాలు కాగా పరిగి ఆస్పత్రికి తరలించారు. ఆంజనేయులుగౌడ్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. అంజయ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిగి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫిట్స్‌తో దినసరి కూలీ మృతి

పూడూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఫిట్స్‌తో ఓ దినసరి కూలీ మృతిచెందాడు. ఈఘటన పూడూరు మండలంలో చోటు చేసుకుంది. చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూదనరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పూడూరు గేటు సమీపంలోని సాయిపత్తి మిల్లులో ఓవ్యక్తి దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. మంగళవారం ఫిట్స్ రావడంతో ఆయన మృతిచెందాడు. మిల్లు యజమాన్యం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుసూదనరెడ్డి తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలి



కొడంగల్ రూరల్: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో

కొడంగల్ రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పారదర్శకంగా, పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో ఉష్శ్రీ అన్నారు. మండల పరిధిలోని హుసేన్‌పూర్‌లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను మంగళవారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి కొండన్న పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: తుంకిమెట్లలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు మంగళవారం సర్వే నిర్వహించారు. సర్వేను ఎంపీడీవో వెంకన్నగౌడ్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో అధికారులతో పాటు మండల కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్, బాల్‌రాజ్‌గౌడ్, హనీఫ్ పాల్గొన్నారు.

పరిగి: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాల్సిన అవసరముందని పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ అన్నారు. పరిగి మునిసిపల్ పరిధిలోని పలుకాలనీల్లో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల వెరిఫికేషన్‌ను కమిషనర్ వెంకటయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణ, నాయకులు చిన్ననర్సింహులు, ఆంజనేయులు, వెంకటేశ్ పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్: అర్హులైన ప్రతీఒక్కరికి ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు నిర్మించి ఇవ్వాలని గుండ్లపోచంపల్లి కండ్లకోయ సర్పంచ్ హంసరాణి కృష్ణగౌడ్ అన్నారు. ఇందిరమ్మ లబ్ధిదారుల జాబిత కోసం మంగళవారం ఆమె కండ్లకోయ పరిధిలోని పలు ప్రాంతాలను పర్యటించి నిరుపేదల నుంచి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా నాయకుడు కృష్ణగౌడ్ పాల్గొన్నారు.

శామీర్‌పేట: ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు అర్హులైన వారిని గుర్తించి పారదర్శకంగా సర్వే చేస్తున్నట్లు ఎంపీడీవో మమతాబాయి అన్నారు. మండలంలోని తుర్కపల్లిలో మంగళవారం ఎంపీడీవో మమతాబాయి, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, సిబ్బంది ఇందరమ్మ ఇళ్ళ మంజూరు కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్న వారి ఇంటింటికి వెళ్లి సమగ్రసర్వేను చేపట్టారు.

రైతులను క్షోభ పెడుతున్న కాంగ్రెస్ సర్కార్



వికారాబాద్: అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



పరిగి: అంబేడ్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

వికారాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతన్నలకు బేడీలు వేసి అరెస్టులు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం వారిని క్షోభపెడుతోందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి, అనేక ఆంక్షలు విధించి గుండె నొప్పితో బాధపడుతున్నా బేడీలు వేసి ఆస్పత్రికి తీసుకెళ్లారని మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్, విజయ్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, గోపాల్, రామస్వామి, కృష్ణ, చంద్రశేఖర్ రెడ్డి, పాండు, ఫయాజ్, గఫ్ఫార్, మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పరిగి: రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచక పాలన కొనసాగిస్తోందని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి విమర్శించారు. కేటీఆర్ పిలుపుమేరకు మహేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో పరిగిలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, ఏఎంసీ మాజీ చైర్మన్ సురేందర్, రైతు బంధు మాజీ అధ్యక్షుడు ఎం.రాజేందర్, పార్టీ మండల అధ్యక్షుడు ఆర్.ఆంజనేయులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దబ్బాని వెంకట్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, అబ్దుల్ అజీజ్, లక్ష్మయ్య, సమద్, మైపాల్, బుచ్చన్న పాల్గొన్నారు.

దోమ: కేటీఆర్ పిలుపు మేరకు అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల గొంతు నొక్కుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు నిరసనగా మంగళవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహనికి వినతి పత్రం అందించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ దోమ మండల మండల అధ్యక్షుడు గోపాల్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం, సొసైటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, రాజీరెడ్డి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

కులకచర్ల: బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బీఆర్ఎస్ నాయకులు మంగళవారం కులకచర్ల మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని దుద్యాల మండలం లగచర్లలో అరెస్టయిన రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లక్ష్మయ్య, పీరంపల్లి రాజు, కృష్ణయ్యగౌడ్ పాల్గొన్నారు.

ధారూరు: లగ్గచర్ల రైతులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండు చేస్తూ మంగళవారం ధారూరులో మండల బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: మండలంలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు మంగళవారం ముందస్తుగా అరెస్టు చేశారు. అసెంబ్లీ ముట్టడికి వెళ్తారనే సమాచారంతో పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. మండలంలోని బీఆర్ఎస్ నాయకుల ఇళ్లకు వెళ్లి పోలీసు వాహనాల్లో స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోట్లయాదగిరి, నారాయణరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, తిరుపతయ్య, నర్సింహులునాయక్, నారాయణ ఉన్నారు.

తాండూరు: లగచర్ల రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి తాండూరు నియోజకవర్గ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పిలుపు మేరకు తాండూరు నియోజకవర్గ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజుగౌడ్, పార్టీ సీనియర్ నాయకులు విఠల్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిండెంట్ నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.



మేడ్చల్: నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

పూడూరు: రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టించిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి పిలుపు మేరకు మంగళవారం పూడూరు మండలంలో నిరసన వ్యక్తం చేశారు. నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లేశం, వెంకటయ్య, మాజీ సర్పంచ్ రాజేందర్‌రెడ్డి, టి.రాజేందర్ తదితరులున్నారు.

మేడ్చల్ టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అణిచి వేసే ప్రయత్నం చేస్తోందని బీఆర్ఎస్ మేడ్చల్ మున్సిపల్ ప్రధానకార్యదర్శి విష్ణుచారి అన్నారు. కొడంగల్‌లో రైతులను అరెస్టు చేసి బేడీలు వేయడాన్ని నిరసిస్తూ మంగళవారం మేడ్చల్‌లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజమల్లారెడ్డి, సందీప్‌గౌడ్, తుడుమ్ గణేష్, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే వంతెన నిర్మాణం నత్తనడక

(5వ పేజీ తరువాయి)

హైకోర్టు రుద్దు చేసింది. అయినా పనులు నత్తనడకన నడుస్తున్నాయి. తమకు పరిహారం చెల్లించకుండా అధికారులు తరచూ నాయకుల అండతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాధితులు నిరసనకు దిగారు. ఇప్పటికైనా కొత్త నోటిఫికేషన్ జారీ చేసి దాని ప్రకారం పరిహారం చెల్లించి పనులు చేయాలని డిమాండ్ బాధితులు చేస్తున్నారు.

బస్సులు రాక రెండేళ్లు

రైల్వే వంతెన నిర్మాణం పేరుతో నాయకులు చేపట్టిన ఇష్టానుసార చర్యల వలన ఘట్‌కేసర్ పట్టణానికి ఆర్టీసీ బస్సులు రాక దాదాపు రెండేళ్లు దాటింది. దీంతో భువనగిరి, జనగాం వరంగల్ వైపుకు వెళాల్సిన ప్రయాణికులు రెండు కిలోమీటర్ల దూరంలోని బైపాస్ వద్దకు రావాల్సి వస్తోంది. ఇలా ఏళ్ల తరబడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పాలకులు మాత్రం పట్టించుకోవడం లేదు. గతంలో పిల్లర్ల నిర్మాణం కోసం తవ్విన గుంతలో పడి ఓ యువకుడు మృతి చెందాడు. వంతెన నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందోనని స్థానికులు ఎదురుచూస్తున్నారు.

ప్రయాణికుల ఇబ్బందులు తీర్చాలి

రైల్వే గేట్ వద్ద చేపట్టిన రైల్వే వంతెన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి. నిర్మాణం పేరుతో గేట్‌ను సైతం మూసివేయడంతో నిత్యం మాధవరెడ్డి రైల్వేవంతెన నుంచి తిరిగి వస్తున్నాం. రాకపోకలు సాగించడానికి ఇబ్బందిగా ఉంది. త్వరగా పూర్తిచేసి ప్రజల ఇబ్బందులను తీర్చాలి. *-పాటి సురేందర్‌రెడ్డి, కొండాపూర్ ప్రయాణికుడు*

పరిహారం చెల్లించి న్యాయం చేయాలి

రైల్వే వంతెన నిర్మాణంలో ఇళ్లు కోల్పోతున్న బాధితులకు పరిహారంతో పాటు 100 చదరపు గజాల స్థలం ఇవ్వాలి. 1997లో కూల్చివేతల సందర్భంగా 60 గజాల భూమి పట్టా సర్టిఫికెట్ ఇచ్చి స్థలం చూపించకుండా అన్యాయం చేశారు. సర్వం కోల్పోతున్న మాకు మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించి న్యాయం చేయాలి.

- బర్ల రాజలింగం, బాధితుడు, ఘట్‌కేసర్

సమ్మెలో 'సమగ్ర'ం!

(5వ పేజీ తరువాయి)

విద్యా వ్యవస్థ స్తంభించిపోయింది. జిల్లా వ్యాప్తంగా 18 కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు ఉండగా, వాటిలో 7 విద్యాలయాల్లో ఇంటర్ వరకు, మిగతా 11 విద్యాలయాల్లో పదో తరగతి వరకు తరగతులు కొనసాగుతున్నాయి. రెండు పట్టణ గురుకుల పాఠశాలలు, 18 భవిత కేంద్రాలు ఉన్నాయి. కేజీబీవీల్లో 5,580 మంది విద్యార్థినులు న్నారు. అలాగే యూఆర్ఎస్‌ల్లో 85 మంది విద్యార్థులు ఉన్నారు. సమగ్ర శిక్ష విభాగంలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న బోధనా సిబ్బంది తరగతులు కొనసాగడం లేదు. విద్యార్థుల చదువులు కొనసాగేందుకు విద్యా శాఖ చర్యలు తీసుకుంటున్నా కేవలం పర్యవేక్షణకే పరిమితమవుతోంది. బోధనేతర విధులు నిర్వర్తించే సిబ్బంది మొత్తం సమ్మె బాట పట్టడంతో ఇతర పనులు కూడా స్తంభించిపోయాయి.

నిలిచిన కార్యకలాపాలు

మండల వనరుల కార్యాలయాల్లో విధులు నిర్వహించే సీఆర్పీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు అందుబాటులో లేక మండలాల నుంచి డీఈవో, జిల్లా కలెక్టర్ నుంచి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల వరకు పంపించే యూడైస్, మధ్యాహ్న భోజన పథకం నివేదికలు పూర్తిగా నిలిచిపోయాయి. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో కొనసాగే బియ్యం పంపిణీ, పాఠశాల బయట ఉన్న చిన్నారుల గుర్తింపు, తదితర కార్యకలాపాలన్నీ స్తంభించిపోయాయి. ప్రభుత్వ పాఠశాలల్లో క్రాఫ్ట్, ఆర్ట్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ బోధించే ప్రత్యేక ఉపాధ్యాయులు తమ విధులకు దూరంగా ఉండి సమ్మెలో పాల్గొంటున్నారు. చిన్నారులకు విద్యా బోధనతో పాటు చేతి నైపుణ్యాలను మెరుగు పరిచేందుకు వారు శిక్షణ ఇస్తున్న విషయం తెలిసిందే. కేజీబీవీ, యూఆర్ఎస్‌లలో బోధనా కష్టాలు కొనసాగుతున్నాయి. నిరవధిక సమ్మెకు కేజీబీవీ, యూఆర్ఎస్ బోధనా సిబ్బంది పూర్తి స్థాయిలో హాజరు కావడంతో విద్యార్థులకు బోధన నిలిచిపోయింది. విద్యా బోధన చేసే సీఆర్‌టీలతో డిసెంబరు నెలాఖరులోగా 10వ తరగతి, ఇంటర్ సిలబస్ పూర్తిచేయాల్సి ఉంది. అంతేకాకుండా ఇంటర్ విద్యార్థులను ప్రాక్టికల్, వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాల్సి ఉంది. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉంది. అంతేకాకుండా పదో తరగతి, ఇంటర్ ఫలితాలపై కూడా ఈ ప్రభావం పడనుంది.

పెరుగుతున్న మద్దతు

తమ డిమాండ్లు పరిష్కరించాలని 12 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు వివిధ ఉపాధ్యాయ, ప్రజా సంఘాలు, నాయకుల నుంచి మద్దతు పెరుగుతోంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఆర్డీవో కార్యాలయం ఎదుట సమ్మె నిర్వహించి.. ఆ తర్వాత తమ ఆందోళన అన్ని వర్గాలకు తెలిసే విధంగా ఏదో ఒక ప్రత్యేక నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ర్యాలీగా వెళ్లి బీజేఆర్ చౌరస్తాలో మానవహారం చేపడుతున్నారు. విద్యా శాఖలో కీలక భూమిక పోషించే ఈ ఉద్యోగులకు ఇప్పటికే ఉపాధ్యాయ సంఘాల జిల్లా, రాష్ట్ర బాధ్యులు తమ మద్దతు తెలియజేయగా, మంగళవారం గజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా బాధ్యులు తమ సంఘీభావం ప్రకటించారు. అంతే కాకుండా తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ప్రధాన రాజకీయ పార్టీల నేతలు కూడా తమ మద్దతు ప్రకటించారు. తమ డిమాండ్లు పరిష్కారమయ్యేంత వరకు తమ పోరాటం కొనసాగిస్తామని సమగ్ర శిక్ష ఉద్యోగులు స్పష్టం చేస్తున్నారు. తమ ఆందోళనకు మద్దతిచ్చే సంఘాల నేతలు తమ తరఫున ప్రభుత్వానికి విన్నవించి ఒత్తిడి తీసుకు రావాలని కోరుతున్నారు.

క్రమబద్ధీకరించేంత వరకు సమ్మె



సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు మా పోరాటం కొనసాగిస్తాం. గతేడాది సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్ష శిబిరానికి టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో వచ్చిన రేవంత్‌రెడ్డి తాము అధికారంలోకి వస్తే వంద రోజుల్లో సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చారు. సీఎంగా అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా ఇంత వరకు ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించి విద్యా శాఖలో విలీనం చేయాలి. డిమాండ్లు పరిష్కరించాలి.

-గాంగ్యానాయక్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్

పాఠశాల భవన నిర్మాణానికి స్థల పరిశీలన



పాఠశాల భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కొడంగల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వందేళ్ల కింద నిర్మించిన కొడంగల్ నియోజక వర్గంలోని దుద్యాల్ మండలంలోని హస్నాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో పంచాయితీ రాజ్ ఏఈ సురేందర్‌రెడ్డి 10గదుల నిర్మాణానికి మంగళవారం పాత పాఠశాల పక్కనే ఉన్న ఖాళీస్థలాన్ని పరిశీలించారు. ఈ భవన నిర్మాణానికి రూ.కోటీ 65లక్షల నిధులు మంజురైనట్లు ఆయన తెలిపారు. దీంతో పాటు మరో 15 గదులు నిర్మించేందుకు అవసరమయ్యే నిధులు త్వరలోనే మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, నాయకులు భీములు నాయకులు నరేశ్, వెంకటయ్య, మైముద్, కృష్ణ, గోపాల్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

నాలాలు ఆక్రమణకు గురికాకుండా చూడాలి



నాలా మ్యాపును పరిశీలిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి, ఏఈ

ఘట్‌కేసర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నాలాలను సంరక్షించి వరదల ముప్పు తలెత్తకుండ చర్యలు చేపట్టాలని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరదిలోని జోడిమెట్ల వద్ద గల నాళాలను వాటి మ్యాపులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాళాలు ఆక్రమణకు గురి కాకుండ చర్యలు చేపట్టాలన్నారు. ఇక్కడ భారీ వరద ముంపు సమస్య ఉంటుందని గుర్తు చేశారు. గతంలో అనేక సార్లు భారీ వర్షాలు కురిసినప్పుడు వరదలతో రాకపోకలు నిలిచిపోయయాన్నారు. ప్రస్తుతం రోడ్డు ఎత్తును పెంచినట్లు వివరించారు. నాళాలాను ఆక్రమించి మూసి వేస్తే తిరిగి ఇబ్బందులు తలెత్తె ప్రమాదమున్నందున తగు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ పరమేష్, నాయకులు బద్దం జగన్‌మోహన్‌రెడ్డి, సామల బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ కారిడార్‌తో యువతకు ఉపాధి

మర్పల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): లగచర్లలో ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటుతో యువతకు ఉపాధి కల్పించనున్నట్లు మర్పల్లి మండల మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి తెలిపారు. మర్పల్లి మార్కెట్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని 29గ్రామ పంచాయతీల పరిధిలోని 45మంది లబ్ధిదారులకు రూ.18లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మల్లేశ్‌యాదవ్, సొసైసైటీ చైర్మన్ ఫసీయొద్దీన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేశ్‌యాదవ్, నాయకులు రాములు, కలీమోద్దీన్, నాగేశ్, రాచన్న, అశోక్‌రెడ్డి, అబ్రహం, నర్సింహులు యాదవ్ పాల్గొన్నారు.

సరిహద్దు మండలంపై ప్రత్యేక దృష్టి సారిస్తా

బషీరాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సరిహద్దు మండలంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ శాంతి, భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తాండూరు రూరల్ సీఐ వై.నాగేష్ తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన మంగళవారం బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలిస్తూ స్థానిక ఎస్ఐ పి.శంకర్‌తో కేసుల పురోగతి, ఇతరేత్రా అంశలపై చర్చించారు. రూరల్ పరిధిలోని పోలీస్‌స్టేషన్ల వారీగా తనిఖీ చేస్తూ పెండింగ్ కేసులపై దృష్టి పెట్టి పరిష్కారానికి తగినచర్యలు తీసుకుంటానని వెల్లడించారు.

తాండూరు రూరల్ సీఐగా నగేష్ బాధ్యతల స్వీకరణ

తాండూరు రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తాండూరు రూరల్ సీఐగా నగేష్ బాధ్యతలు చేపట్టారు. ఇంతకాలం ఇక్కడ పనిచేసిన సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల పరిగికి బదిలీ అయిన విషయం విధితమే. ఆయన స్థానంలో సంగారెడ్డి జిల్లా డీసీఆర్బీ(డిస్ట్రిక్ట్ క్రైం రికార్డ్ బ్యూరో)లో సీఐగా పనిచేస్తున్న నగేష్ తాండూరు రూరల్ సీఐగా బదిలీపై వచ్చారు. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి మంగళవారం రూరల్ సీఐని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

బూత్ కమిటీల ఏర్పాటు

పూడూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బీజేపీ బూత్ కమిటీలు ఏర్పాటు చేసినట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెంట్రల్ ఫిలీం సెన్సార్ బోర్డు సభ్యులు, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాఘవేందర్ ఆధ్వర్యంలో ఈ కమిటీలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. బూత్‌సభ్యులుగా శ్రీకాంత్, సుభాన్, సత్యనారాయణలను నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు శ్రీశైలం, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

శామీర్‌పేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శామీర్‌పేటకు చెందిన దూడల బాల్‌రాజ్‌గౌడ్- మణెమ్మ దంపతులు, దూడల వెంకటేష్ గౌడ్- ప్రసన్న దంపతులు, దూడల ప్రవీణ్‌గౌడ్ గురుస్వామి- మమత దంపతులు అన్నదానం చేశారు. అదేవిధంగా తూంకుంటకు చెందిన తీగుళ్ళ సుధాకర్ వారి కుటుంబ సభ్యులు 25కేజీల బియ్యం ఇవ్వగా తూంకుంటకు చెందిన ప్రధాని నరసింహ ఆర్థిక సాయం చేశారు.

డిసెంబరు 17 పెన్షనర్లు మర్చిపోలేని రోజు

వికారాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): డిసెంబర్ 17 పెన్షనర్లు మర్చిపోలేని రోజని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం వికారాబాద్ మండల అధ్యక్షుడు మాణిక్ ప్రభు అన్నారు. వికారాబాద్ సత్యసాయి జ్ఞాన కేంద్రంలో మంగళవారం జాతీయ పెన్షనర్స్‌డే సందర్భంగా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ.. ధరం స్వరూప్ నకార పెన్షనర్ల కోసం పోరాడిన మహా మనిషి అని తెలిపారు. పెన్షన్ మనకు ఇచ్చే ఒక బహుమానం కాదని, ఇది గతంలో అందించిన సేవలకు చెల్లింపని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెంజమిన్, సత్యనారాయణగౌడ్, శ్రీహరి, కిష్టయ్య, సతీష్ చంద్ర, విజయరావు, పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తుది జాబితా విడుదల

శామీర్‌పేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట మండలంలోని వివిధ గ్రామపంచాయతీల్లో నిర్వహించనున్న పంచాయతీ ఎన్నికల వార్డుల పోలింగ్ కేంద్రాల తుదిజాబితాను మంగళవారం శామీర్‌పేట మండల పరిషత్ కార్యాలయం నోటీస్ బోర్డులో ఎంపీడీవో మమతాబాయి, పంచాయతీ అధికారులు ప్రదర్శించారు. శామీర్‌పేట మండలంలోని ఏడు గ్రామపంచాయతీలకు సంబంధించి పంచాయతీ ఎన్నికలను సమర్థవంతగా నిర్వహించేందుకై వార్డుల వారిగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకై తుదిజాబితాను మండల పంచాయతీ అధికారులు పూర్తి చేసి నోటీసు బోర్డులో పెట్టారు.

ప్రతీ వార్డుకు సీసీ రోడ్డు



పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ దీపిక నర్సింహారెడ్డి

మేడ్చల్ టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రజా అవసరాలకు అనుగుణంగా సీసీ రోడ్డులను ఏర్పాటు చేశామని మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 4, 9వ వార్డుల్లో రూ.10లక్షల చొప్పున నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆమె మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు తుడుమ్ గణేష్, చాప రాజు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ మర్రి నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

మేడ్చల్ టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి మురళీధర్‌గౌడ్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ 17 బూత్ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో బూత్‌కమిటీలను ఎన్నుకుంటున్నట్లు తెలిపారు. బూత్ కమిటీల నాయకులు స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి నాయకులు దొడ్డ మల్లికార్జున్ ముదిరాజ్, ఊషిగారి శ్రీనివాస్, శ్రీధర్, వక్రమ్, నవీన్ ముదిరాజ్ పాల్గొన్నారు.